


## వివిధ వాహనారూఢుడై ఊరేగిన వేంకటేశ్వరుడు!

ప్రసాదించినందున శరదృతువులో బహుళ పాఢ్యమి నుంచి మహార్నవమి వరకు దేవీ నవరాత్రుల్ని జరుపుకొని, దశమినాడు విజయదశమి (దసరా) సంబరాలు చేసుకోవడం భారతీయ సంప్రదాయం. నవరాత్రుల్లోని అమ్మవారిని మహాదుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి మూర్తులుగా ఆరాధించడం విశేసం. పదవ రోజైన విజయదశమినాడు – దశమి తిథి, శ్రవణా నక్షత్రం, సంధ్యా కాలం తర్వాత పరాశక్తి అనంత శక్తిమంతురాలైన శుభఘడియలల్లో చేపట్టిన పనులు విజయవంతమవుతాయన్నది భారతీయ విశ్వాసం. రాక్షస సంహారం కోసం సాక్షాత్తూ అమ్మవారే తొమ్మిది రోజుల పాటు అనుష్ఠానాలతో వ్రతం చేసిందంటారు. ఆ వ్రత ఫలితంగా సమస్త దేవతలూ తొమ్మిది రోజుల పాటు తమ సమస్త ఆయుధాలనూ అమ్మకు సమర్పించుతారట. వ్రతంలో భాగంగా ఆదిశక్తి ఆయుధాల్ని పూజించి, బలోపేతురాలైందని పురాణాలు వర్ణించాయి. పురాణ పురుషులు ఈ అమ్మను ఆదర్శంగా తీసుకొన్నారు. రామరావణ సంగ్రామ సమయంలో శ్రీరామచంద్రుడు అమ్మ వారిని సేవించి, అఖండ విజయం సాధించాడని పౌరాణికులు చెబుతారు. పాండవులు జమ్మిచెట్టునీ, ఆయుధాల్నీ అర్పించి దశమినాడు దాయాదుల్ని ఓడించారంటారు. ఆరోజునే ఆయుధాలకూ, వాహనాలకూ పూజలు చేసేవారు.

నా నోము పండించి ఉయ్యాలో... శరత్కాలానికి శ్రీకారం చుడుతూ నింగినీలం కుర్చీమీద పాడ్యమి నెల బాలుడు తొంగి చూడగానే తెలంగాణ జానపద వనితల్లో సంబరాల సరాగాలు ఊపందుకొని, ఉయ్యాలలై ఊగుతాయి. పూల రాశులతో కూడిన బతుకమ్మ తల్లి ప్రతి గడపనూ అలరిస్తుంది. బంగారు గౌరమ్మగా ఆశీర్వదిస్తుంది. దుర్గాష్టమి వరకు సాగే ఈ బతుకమ్మ వేడుకల్లో ప్రకృతిలో మనిషి మమేకం కావడం కనిపిస్తుంది.

# నవరాత్రులు... నవ రూపాలు


1. ప్రళయసాగర పాత్రమై... ప్రణవనాదమె గాత్రమై...
   బ్రహ్మ విష్ణులు ప్రస్తుతించిన 'మహాకాళీ' ప్రథమ రూపం
2. విలయతాండవ జ్వలిత వేదిక మాత జన్మస్థానమై
   సింహవాహిని చిద్విలాసిని 'మహిషమర్ధిని' ద్వితీయం
3. పార్వతీసతి దేహమందున చండముండుల అసుర వర్గం
   వెడలగా చెండాడినది 'చాముండి దేవీ' తృతీయం
4. నందయశోదానందదాయిని కృష్ణ సోదరి కృపామయి
   కంసుని చెరలో కల్పితఛాయ చతుర్ధమాయెను 'యోగమాయ'




5. విశృంఖలుడై విశ్వజిత్తు విశ్వంభరనే వేధించగా
   కోరలతో కడతేర్చిన ఇంతి పంచమరూపిణి 'వజ్రదంతి'
6. కరువు రక్కసుని పదఘట్టనలో జగతి జనులు అల్లాడగా
   ఆకులలో వ్యాకులము తీర్చినది షష్టమం 'శాకంభరి' రూపం
7. హద్దులెరుగని ధూర్త దుర్గముడిపాలన అంతమొందించ ధరణిలోన
   సత్యశివసుందరం సౌభాగ్యదాయకం సప్తమం 'కనకదుర్గావతారం'
8. మునిమంతంగుని తపము మోదకారణము భువిలోన శ్రీహాత అవతరణము
   కీర్తించినది జగతి హృదయముప్పొంగి అష్టమం అలివేణి 'లలిత మాతంగి'
9. గర్వాంధుడై మీరె దనుజుడా అరుణుడు గాయత్రినే విస్మరించినాడు
   ఝుమ్మంది సమరాన భ్రమరవిన్యాసం 'భ్రమరాంబ' దాల్చినది నవమ రూపం.



# తెలుగు నేలయే నేల! తెలుగువాడే మానవుడు! తెలుగు భాషే భాష! తెలుగు భాషా తీవ్రవాది ఆదిభట్ల నారాయణదాసు



తెలుగువారి సర్వతోముఖ వికాసం కోసం తెలుగు భాషనే ఉపయోగించుకోవాలనీ, ఇతర భాషల సహాయం తీసుకున్నా వాటికి లొంగిపోయి మన నుడిని మాపుకోకూడదనీ తన గొంతు తనదిగా వినిపించిన తెలుగుబిడ్డ శ్రీ మద్దజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు.

హరికథా పితామహుడుగా చరిత్రకెక్కిన శ్రీ మద్దిజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు తెలుగు నుడి కోసం, దాని వెలుగు కోసం పడిన ఆరాటం మాటలకు అందనిది. ఆయనకు ఉన్నంత పట్టుదల, గట్టితనం, గడుసుదనం తెలుగు కోసం పోరాడిన కందుకూరి, గురజాడ, గిడుగు, శ్రీపాద మొదలైన పెద్దల కంటె కొంచెం పై మెట్టునే ఉంటాయి. తెలుగుబాస కునారిల్లుతోందని కుమిలిపోతున్న నేటి తెలుగువారందరం ఆ పెద్దాయనను, తెలుగును బ్రతికించడానికి ఆయన చేసిచూపిన తెగువను తగవులను తలచుకోవాలి.

'జనని సంస్కృత భాషా ప్రభావం భారతీయ భాషలపై వుంది. ఆయనకు సంస్కృత భాషలో ప్రావీణ్యం ఉంది. తెలుగులోనూ ఉన్నది. ఎన్నో రచనలు చేశారు.

## హరికథకు 'ఆది'- అనాది!

"ఆయనే ఒక విశ్వవిద్యాలయం" అంటూ కట్టమంచి రామలింగారెడ్డి వంటి విద్యా కోవిదులు ఆదిభట్లను కొనియాడారు. విజయనగరం జిల్లా, బొబ్బిలి ప్రాంతంలోని మారుమూల పల్లెటూరు అజ్జాడలో 1864 ఆగస్టు 31న జన్మించిన ఆదిభట్ల నారాయణదాసు సంస్కృతం. తెలుగు, తమిళం, హిందీ, ఉర్దూ, బెంగాలీ, ఆంగ్లం, అరబిక్, పర్షియన్ భాషల్లో 'ప్రావీణ్యం' సాధించిన తీరు అనన్యం! ఆదిభట్ల కవి, నటుడు, అవధాని, తత్త్వవేత్త మాత్రమే కాక సంగీత, నాట్యశాస్త్రాల్లో అందె వేసిన చేయి. దక్షిణ భారతదేశంలో విలక్షణ సంస్కృతిక కళా ప్రక్రియగా ప్రఖ్యాతిగాంచిన 'హరికథ'కు ప్రాణం పోసి, తన గాత్రంతో ఊరూరా గానం చేసి 'హరికథా పితామహుడు' అన్న బిరుదును సొంతం చేసుకున్న ఘనాపాటి. గజేంద్రమోక్షం, రుక్మిణీ కళ్యాణం వంటి ఎన్నో హరికథలను రచించి తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నవరస తరంగిణి, జగద్జ్యోతి, హరికథామృతం వారి రచనల్లో ముఖ్యమైనవి.

కాళిదాసు, షేక్స్పియర్ రచనలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన ఘనత ఆదిభట్లకే సొంతం. ఉమర్ ఖయామ్ రుబాయీలను సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్ భాషల్లోకి పద్య రూపంలో అనువదించారు. ఉమర్ ఖయామ్ హృదయాన్ని పొల్లుపోకుండా ఆవిష్కరించడానికి నారాయణదాసు పర్షియన్ భాషా సంస్కృతుల్లో దాగిన మూలాలను శోధించిన తీరు విమర్శకులను సైతం అబ్బురపరచింది. కర్ణాటక శాస్త్రీయ సంగీతంలోని దాదాపు అన్ని రాగాలను స్వరపరచి అపర త్యాగయ్యగా కీర్తి గడించారు. ఆదిభట్ల సంగీత స్వరలయలకు గుర్తింపుగా 'లయబ్రహ్మ', 'పంచముఖీ పరమేశ్వర', 'శృంగార సర్వజ్ఞ', 'సంగీత సాహిత్య సార్వభౌమ' వంటి బిరుదులు ఆయనను వరించాయి. 'సాహిత్య, సంగీతాల మధ్య సమతూకాన్ని సాధించిన మేలిమి బంగారం ఆదిభట్ల నారాయణదాసు' అంటూ మహాకవి శ్రీశ్రీ నోరారా కొనియాడారు. మహారాజుల కితాబులు, ప్రభువుల పారితోషికంకన్నా రసహృదముల ప్రస్తుతికే ఆదిభట్ల పులకించి మైమరచిపోయారు. బాల్యం నుంచి తన జీవితానుభవాలను, జ్ఞాపకాలను 'నా యెరుక' అనే పేరుతో ఆదిభట్ల తమ ఆత్మకథ రాశారు. ఏ పని చేపట్టినా అందులో అగ్రస్థానం సాధించాలనే తపన ఆయన జీవితానికి వన్నె తెచ్చింది. ఆయన ఆ విధంగా అన్నింటా అగ్రగామిగానే నిలిచారు. సంగీత, సాహిత్య, సంస్కృతిక, కళారంగాలతో పాటు భాషాశాస్త్రాల్లోనూ మన దేశంలో మరెవ్వరూ సాటిరాని స్థాయిలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా వేనోళ్ల ప్రశంసలందుకున్న ఆదిభట్ల నారాయణదాసు 1945 జనవరి 3న తమ 81వ ఏట కన్నుమూశారు. అప్పటికి పండిత ప్రకాండులకు మాత్రమే పరిమితమైన సంక్లిష్టమైన అంశాలను పామరులకు సైతం అర్థమయ్యేలా సరళంగా ఆవిష్కరించిన ఆదిభట్ల సాహిత్య కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దాయకం కావాలి.

కానీ తల్లిభాషను నిలబెట్టుకోవాలంటే ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ మొదలైన భాషలతో పాటు సంస్కృత భాషను దూరంగా ఉంచి తగు మాత్రంగానే ఉపయోగించుకోవాలని కచ్చితంగా చెప్పిన భాషాతీవ్రవాది ఆదిభట్ల.

**మొలక లేతదనము తలిరుల నవకంబు**
**మొగ్గ సోగదనము పైపుఁదావి**
**తేనె తీయదనము తెల్గునకేగాక**
**పరుష సంస్కృతాఖ్య భాషకేది?**

– అని నిర్భయంగా ప్రకటించాడు. సంస్కృత పదాలకు డు,ము, వు,లు చేర్చటం, తద్భవాలుగా ఆ భాషాపదాలు తెచ్చుకొని తెలుగు అనటం కూడా ఆయనకు ఇష్టం లేదు. 'అచ్చ తెలుగు'లో 'అచ్చ' అచ్చపదం నుండి పుట్టింది కనుక అసలైన తెలుగును 'నాటు తెలుగు' అని పిలవాలి.

"నాటు తెనుఁగనగా దేశీయమైనది. జాత్యమైనది. నాటు తెనుఁగులో నైసర్గికమైన సొగసున్నది. ఆ సొగసులు ఎడ్డెలకు తెలియదు. బండి 'అం' అరసున్న, 'ళ' కారము తెనుగుభాషకు ప్రత్యేకములు. అవిలేని సంస్కృత భాష నుండి తెలుగు పుట్టెననుట తప్పు. ఆ మాటకు వచ్చినచో తెనుగు మాటల నుండియే కొన్ని సంస్కృత శబ్దములు పుట్టినవి. కానిచో తెనుగు జనసామాన్యము నోళ్లనుండి సంస్కృత పదము లెట్లు దొరలును!.."

పై విధంగా ఆదిభట్ల మాతృభాషా పరిరక్షణలో ఆనాటి పెద్దలకంటె కూడా తీవ్రమైన తీర్మానాలు చేసి తెలుగుభాషను ఆంధ్రభాష అనటాన్ని వ్యతిరేకించారు. త్రిలింగ భాషా అనాలని ప్రకటించారు.

త్రిలింగ దేశభాషైన పరుషాక్షరవర్జితం
విసృష్టా సర్వసులభా స్వతంత్రా సార్వలౌకికా
త్రిలింగ భాషైవాస్మాకం నాంధ్రభాషాకదాచన

**వయం ప్రమాదతో హ్యాంధ్రా ఇత్యాఖ్యాతా న సంశయః**
**త్రిలింగ భూరేవ భూమిః త్రిలింగనరేవ నా**

త్రిలింగ భాషైనా భాషా నాత్ర కార్య విచారణా (తెలుగు పరుషాక్షరాలు లేనిది, స్పష్టమైనది, సులభమైనది, స్వతంత్రమైనది. అన్ని విధాలుగా పనికివచ్చేది తెలుగు మాత్రమే. మన భాష త్రిలింగ భాష. ఆంధ్రభాష కాదు. పొరబాటున ఆంధ్రులుగా పిలవబడుతున్నాం. తెలుగు నేలయే నేల. తెలుగువాడే మానవుడు, తెలుగు భాషే భాష. దీనికి విచారణ లేదు)

**తెలుగు మాటాడువారలు తెలుగువారు**
**కాన చెడుగులౌ యాంధ్రులు కారుకనుక**
**ఆంధ్రరాష్ట్రము మాది మేమాంధ్రులమని**
**చెప్పుకొనరాదిక తెలుగుసీమ వారు!**

అని దాసు గారి నిర్ణయం. వేదపురాణాలలో ఆంధ్రజాతికి అపకీర్తి ఉంది. విశ్వామిత్ర శాపం. కౌరవపక్షంలో చేరటం మొదలైన కారణాలవలన ఆంధ్రులు వేరు. తెలుగు మాట్లాడేవారు తెలుగు వారే అవుతారు కాని ఆంధ్రులు కారు. కనుక ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రులు అనికాక తెలుగుసీమ, తెలుగువారు అనాలి. తెలుగువారు అన్ని విషయాలను తెలుగులోనే తెలుసుసుకోవాలి. ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించి తెలుగులో వినాలి. చదవాలి. అప్పుడే సరిగా అర్థం అవుతుంది.

'వేల్పుబాసను వేల్పుబాస చేతనే వేల్పుబాస రానివారి కెరగించుట కొఱగాని పని' (వెన్నుని వెయిపేర్ల వినకరి)

శాస్త్ర గ్రంథాల రచన, విద్యాబోధన తెలుగు భాషలో జరపటం మొదట్లో ఇబ్బందిగా ఉన్నా క్రమంగా అలవాటు అవుతుందని ఆనాడే ఆదిభట్ల మాతృభాషలో బోధించాలని ఎలుగెత్తిచాటాడు.

**తానెర్గి యెర్గింపదగు నాటుమాట**
**బ్రతుకు హాయిగ బయల్పడు నెల్లచోట**
**ఒండొరులకు నేస్త మొనరింపఁజాలు**
**మానిసులకు నాటుమాటలే మేలు**
**(ద్విపదలు)**

తమకు ఎదుటివారికి తెలిసిన తల్లిబాసలోనే భావవ్యక్తీకరణ హాయిగా ఉంటుంది. అందరినీ కలిపి ఉంచే మాతృభాషే గొప్పది.

'తెలుగు' త్రిలింగ శబ్దంలో నుండి పుట్టింది. 'తెనుగు' త్రినగ శబ్దభవం. తెన్ అగు (దక్షిణ దిక్కు) అనే నిర్వచనాలను ఆదిభట్ల తద్భవాలుగా అంగీకరించలేదు.

తెనుగుభాష నైసర్గికతను హరిస్తూ ఆక్రమించే ఇతర భాషల గుంపులో సంస్కృతాన్ని కూడా చేర్చి సంస్కృత పదాలుగా భ్రమింపచేసే కొన్ని తెలుగు పదాలను ఉదహరించారు.

గడిచిన డెబ్బై ఎనభై ఏళ్ల కాలంలో తెలుగు భాషలో విద్యాబోధన విషయంలో విద్యావేత్తలు చేసిన ఎన్నో సూచనలు అమలుకాక మూలపడి ఉన్నాయి. సాంకేతిక విద్య, సకల శాస్త్రాలు మాతృభాషలోనే బోధించే ప్రణాళికను నారాయణ దాసు గారు తన రచనలలో అందించారు.

వేదాలు కూడా తెలుగులో చదవాలని ఋగ్వేద మంత్రాలను 'మ్రొక్కుబడి' పేరుతో నాటు తెలుగులో వ్రాశారు. వేదాంతంలో 'భగవద్గీత' ను తెలుగులో 'వేల్పుమాట'గా వ్రాశారు.

జ్యోతిషం, చందస్సు మొదలైన శాస్త్రాలలో సాంకేతిక పదాలను తెలుగులో చూపించారు. ఆదివారము అనే సంస్కృత పదానికి 'ప్రొద్దువంతు' సోమవారానికి 'నెలవంతు' చైత్రమాసానికి 'ముత్తైపురిక్కనెల'.

ఛందస్సులో సంస్కృత పదాలకు తెలుగు పేర్లు పెట్టారు.

సీసము=ఒజ్జ, ఉత్పలము=పాలబువ్వ, మత్తేభము=పుట్టిల్లు.

పై పారిభాషక పదాలను చూస్తే కొత్తపేరు పెట్టుకోవటమేకాని అనువదించనవసరం లేదు అనే సూచన కూడా ఉంది.

ఆయుర్వేద వైద్యశాస్త్రం సంస్కృత భాషలోనే నేర్వనక్కర్లేదు తెలుగులో నేర్చుకోవచ్చునని 'మన్కిమిన్కు' అనే రచన చేశారు. దాంట్లో వైద్య పరిభాష తెలుగులో చెప్పబడింది. మన్కి=ఆయువు, మిన్కి=వేదము.

గాలి, కిత్తి, తెమడ=వాత, పిత్త, శ్లేష్మ; చియ్య=మాంసం; కందు=శిశువు మొదలైనవి.

తొంభై నాలుగు పుటల ఈ గ్రంథంలో తొమ్మిది విభాగాలున్నాయి. వేదోపనిషత్తులలో చెప్పిన వైద్యాలు, మందులు నాటు తెలుగులో చెప్పబడ్డాయి.

'సీమపలుకువహి' అనే గ్రంథంలో నాటు తెలుగు పలుకుల నిఘంటువు. ఇది అసంపూర్ణంగా లభిస్తోంది.

విష్ణు సహస్రనామాలను 'వెన్నుని వెయిపేర్ల వినకరి'గా లలితాసహస్ర నామాలను 'తల్లివిన్కి' గా 'నవరసతరంగిణి'లో ఇతర భాషలలో కాళిదాసు, షేక్స్పియర్ వంటి మహాకవులు వ్రాసిన రసవంతమైన కవితలను అచ్చ తెలుగులోకి తెచ్చారు. ఈసపు కథలను 'నూఱుగంటి' పేరుతో పిల్లల కోసం తెలుగులో వ్రాశారు.

తెలుగువారి సర్వోతోముఖ వికాసం కోసం తెలుగు భాషనే ఉపయోగించుకోవాలనీ, ఇతర భాషల సహాయం తీసుకున్నా వాటికి లొంగిపోయి మన నుడిని మాపుకోకూడదనీ మొండి పట్టుదల మనిషిగా ఇతరులు భావించినా తన గొంతు తనదిగా వినిపించిన శ్రీ మదాజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారు తన ఇంటి పేరుకు ముందు తాను పుట్టిన ఊరుపేరును కూడా మరచిపోకుండా కలుపుకుని జన్మించిన గ్రామానికి విలువనిచ్చారు.

రక్తాక్షినామ సంవత్సర శ్రావణకృష్ణ చతుర్దశి బుధవారం నాడు (31-8-1864) దాసుగారు జన్మించారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఆయన జయంతి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఇప్పటికీ జరుపుతున్నారు. విజయ నగరం, విశాఖపట్టణం, విజయవాడలలో వారి విగ్రహాలు నెలకొల్పబడ్డాయి. విజయవాడ శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో సెప్టెంబరు 6,7,8 తేదీలలో వైభవోపేతంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. తెలుగు భాష కోసం తనదైన ప్రత్యేకశైలిలో కృషిచేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, హరికథా పితామహునకు నమస్సులు.

**తెలుగువారకున్ తేటతెల్లముగను**
**తెనుగుతో నెల్లవిద్దెల దెలుపనెంతు**
**(జగజ్జ్యోతి)**

**(– డా॥ పాలపర్తి**
**శ్యామలానందప్రసాద్ గారికి**
**కృతజ్ఞతలు)**

## తొలి తెలుగు కార్టూనిస్టు
# తలిశెట్టి రామారావు



తెలుగు కార్టూన్ను గుర్తు చేసుకునే ప్రతి సందర్భంలోనూ తలిశెట్టి రామారావు పేరును ప్రస్తావించవలసిందే. ఎందుకంటే తెలుగు వారిలో మొదటి కార్టూనిస్టు తలిశెట్టి రామా రావుగారు జయపురం హైస్కూల్లో చదువు కుంటున్న రోజుల్లో స్కూలు ప్రధానో పాధ్యాయులైన డాక్టర్ గిడుగు సీతాపతిగారు రామారావు గారిలో సహజ సిద్ధమైన చిత్ర కళాభినివేశాన్ని గుర్తించి చిత్రకళాభ్యాసం చేయడానికి "ఆగ్స్బర్గ్" డ్రాయింగ్ పుస్తకం ఇచ్చారు. "ఆగ్స్బర్గ్" పుస్తకంలో తాను నేర్చు కున్న నైపుణ్యంతోకార్టూన్లు వేయడం ప్రారం భించారు. రామారావుగారు తొలిసారిగా గీసిన కార్టూన్ గిడుగు సీతాపతిగారిదే కావడం విశేషం. పర్లాకిమిడిలో ఇంటర్ మీడియట్, విజయనగరంలో బ్యాచిలర్స్ డిగ్రీ, జయపురం శ్రీ విక్రమదేవవర్మగారి ఆర్థిక సహాయంతో బ్యాచ్లర్ ఆఫ్ లా చదివి పార్వతీపురంలో ప్రాక్టీసు ప్రారంభించారు. భుక్తి కోసం న్యాయవాద వృత్తి చేసినా వారి ధ్యాసంతా వ్యంగ్య చిత్రాలమీదే వుండేది. ప్రఖ్యాత మాసపత్రిక "భారతి"లోనూ, ఆంధ్రపత్రికలోనూ వీరి కార్టూన్లు ఎక్కువగా ప్రచురితమయ్యాయి.

విక్రమవర్మగారికి తలిశెట్టి వారిపై వుండే అభిమానంతో వీరిని అసిస్టెంట్ దివాన్గా నియమించారు. ఈ తెలుగుకార్టూన్ పితామహుడు 1960లో తనువు చాలించారు. ("తెలుగు కార్టూనిస్టులు, కార్టూన్లు" సంకలనం నుండి)

## ఆడపిల్లలు స్వశక్తిపై నిలబడేట్టు చేయడం తల్లి బాధ్యతయినట్లే, పురుషులు తాగుబోతులు గాకుండా ఉండడానికి స్త్రీయే బాధ్యత వహించాలన్న తెలంగాణా ధీరవనిత

# ఈశ్వరీబాయి!

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కానప్పుడు నిజాం రైల్వేలో దళిత యువకుడు బలరామస్వామి గూడ్సు మాష్టర్‌గా పనిచేసేవాడు. ఆయన భార్య రాములమ్మ. ఆ దంపతుల గారాబు బిడ్డగా, 1918 సం॥ము, డిసెంబర్ 1న జన్మించిన ఆమెకు విద్యాబుద్ధులు నేర్పించడంలో తల్లితండ్రులు ఏ కొరత రానీయలేదు. అక్కడ ఉన్నత పాఠశాలలో గల ఉన్నత విద్యనంతా ఔపోసన పట్టించారు. ఆత్మాభిమానం గల ధీరవనితగా చిన్నతనం నుంచే తీర్చిదిద్దబడింది.

1940 సం॥ దరిదాపు వరకూ బాల్య వివాహ వ్యవస్థ ఉన్నది. ఆమె 13వ ఏటనే పూనేకు చెందిన డాక్టర్ జె.లక్ష్మీనారాయణతో ఈశ్వరబాయ్‌కు వివాహం జరిగింది. దురదృష్టమేమోగానీ, ఆ దాంపత్యం అనతి కాలంలోనే భర్త మరణించడంతో తిరిగి ఆమె సికిందరాబాద్‌కే తిరిగివచ్చారు. పరోపకారిణీ పాఠశాలలో ఆమె ఉపాధ్యాయునిగా చేరారు. వారి దాంపత్య ఫలితంగా ఓ కుమార్తె కలిగింది. ఆమెయే ఇప్పటి రాష్ట్రమంత్రి వర్గంలోని గీతారెడ్డి.

ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నప్పుడే ఆమె సామాజిక కార్యక్రమాల్లోకి అడుగువేసారు. అప్పుడు సమాజంలో అంటుకున్న అంటరానితనం ఆమెనెంత గానే కలచివేసింది. అఖిల భారత షెడ్యూల్డు కులాల సమాఖ్య (ఆంధ్ర–తెలంగాణా శాఖ) ప్రధాన కార్యదర్శినిగా ఎన్నికయ్యారు. బాబాసాహెబ్ అంబేత్కర్ ఉద్యమాలు, ఉపన్యాసాలూ ఆమెనెంతగా ప్రభావితం చేసాయ్. భాగ్యరెడ్డి ఆది హిందూ సమాజ సేవా సమితి, బి.వెంకటరావు ద్రావిడ సంఘం, అరిగె రామస్వామి హిందూ మహాసభ, రిపబ్లికన్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఎక్కువ సమయాన్ని ఆమె బడుగు వర్గాల సేవకూ, అభాగ్య స్త్రీల సేవకూ ప్రాధాన్యత యిస్తూండేవారు. 1986 సం॥ములో రిపబ్లికన్ పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికై, చివరి శ్వాస వరకూ ఆ పార్టీలోనే పీడిత జనసేవ కొనసాగించారు. దళితులకు ఏ కష్టం కలిగిననూ చూస్తూ ఉండే మనిషి మాత్రం కాదు. వ్యక్తిగతంగా ఆమె ఎవర్నీ ద్వేషించేవారు కాదు. అన్యాయం జరుగుతున్నప్పుడెంతటివారినైనా లెక్క చేసేవారు కాదు. ఒకరకంగా చెప్పాలంటే దుర్గాబాయ దేశ్‌ముఖ్ వంటి ధీరోత్తమురాలు. ఇందుకు ఉదాహరణంగా ఆమె రాజకీయ జీవితంలో జరిగిన ఈ అద్భుత సంఘటననే ఉదాహరణంగా తీసుకోవచ్చు!

కృష్ణా జిల్లా కంచకచర్లలో కోటేశు అనే ఒక దళిత యువకుణ్ణి పై వర్ణాల వారు సజీవ దహం చేసారనెడి అభియోగంపై చర్చ జరుగుతూన్నది. ఆ సభ్యురాలి ఆవేదనను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి స్పందించి క్షమాపణ చెబుతూన్నారు. ఈ సమయంలోనే సభలోని వ్యవసాయ మంత్రి వ్యంగ్య ధోరణిలో 'దొంగతనం చేస్తే ముద్దెట్టుకుంటారా?' అని వ్యాఖ్యానించారు. ఈశ్వరీబాయ్‌కి చిర్రెత్తిపోయింది. కోపాన్ని ఆపుకోలేక పోయింది. ఈశ్వరీబాయిలో వీరభద్రత్వం పెరిగిపోయింది. వెంటనే లేచి – 'షటప్' ఇంకొక్క మాట మాట్లాడావంటే చెప్పుతో కొడతా' అంటూ రుద్రమూర్తియై ఆ మంత్రివైపు దూసుకుని వెళ్లారు. ఇదంతా చూస్తున్న ముఖ్యమంత్రి ఆమెను శాంతించమని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి మాటతో ఆమె సద్దుమణిగింది. దళిత స్త్రీల సమస్యలు వచ్చినప్పుడు, ఆమె ఉపేక్షించేవారు కాదు. వ్యక్తిగతంగా ఏ కులాన్నీ ద్వేషించే స్వభావి కాదు కాబట్టే, ముఖ్యమంత్రి కలుగజేసుకుని శాంతింప చేసారు.

హైదరాబాదు సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సమయంలో సికిందరాబాద్ హైదరాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికలు వచ్చాయ్. ఈశ్వరీబాయ్ చింతలగుడా నియోజకవర్గం నుంచీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. 1967 సం॥ములో నిజామ్‌బాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజిక అభ్యర్థిగా శాసనసభ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికయి, శాసన సభలో తొలి అడుగుపెట్టారు. ఆ శాసనసభలో మహోద్దండులైన తరిమెల నాగిరెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, గౌతు లచ్చన్న, పుచ్చలపల్లి సుందరయ్య, తెన్నేటి విశ్వనాథం వంటి మత్సరం లేని



నాయకులుండేవారు. అలాంటి సభకు ప్రతిపక్ష నేతగా ఈశ్వరిబాయ్ పదవిని నిర్వహించారు.

సామాజిక న్యాయం, కార్మికుల రక్షణ, దళితులకు భూమి పట్టాలివ్వడం, బౌద్ధం స్వీకరించిన దళితులకు ఎస్టీ హోదా, వితంతువులకు పింఛన్లు, ఇంటర్ వరకూ బాలికలకు ఉచిత చదువు, పట్టణ శివార్లులోని మురికివాడ వాళ్ళకు పక్కా యిళ్ళు వంటి సౌకర్యాలు కల్పింపచేయడంలో ఆమె విశిష్ట కృషి చేసారు. కార్మికుల సమస్యల పరిష్కరంలో కమ్యూనిస్టులతో పనిచేయడానికి వెనుకాడలేదు. సమాజంలో, కుటుంబ విషయాల్లో స్త్రీ నిర్వహించే పాత్ర తప్పకుండా ఉండాలన్నది ఆమె అభిమతం. పురుషులు త్రాగుడుకు పాల్పడకుండా 'స్త్రీ' లే చూచుకోవాలని, ఆడపిల్లలు స్వశక్తితో నిలబడడం కూడా తల్లుల బాధ్యతేనని అన్నారామె. ఈశ్వరబాయ్ గురించి వ్రాయడానికి ఎంతో ఉంది. ఎంతో ఉన్నత పదవులు ఆమె అధిష్టించినప్పటికినీ అహం లేదు. పొరపాట్లు జరిగినప్పుడు 'పులి'గా విరుచుకుపడే వీరత్వం ఉండేది కానీ, ఎవరిమీదా వైరిభావం కలిగే ఉండే మహిళ కాదు. ఇంత చరిత్రను, సమాజ సేవను తనకు తానుగా నిర్దేశించుకుని నిర్వహించిన ఈశ్వరీబాయ్ 1991 సం॥ము ఫిబ్రవరి 24వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆ స్థానాన్ని ఎవరూ అధిరోహించిన దాఖలాలు లేవు. ●



## విశ్వసోదర, భావ విజ్ఞాన విభవంబు వెలయించడానికి సనాతన ధర్మ సుధా సారగా విశ్వ కుటుంబ భావనతో హిందూ మతం అవధ అవతరించింది

## సంస్కృతీ నాశనానికి, గోవధ, హిందూ ఆలయ ధర్మ సంస్థల దోపిడీ నిలిపే శక్తిని నిటలాక్షుడు కల్గించాలి.

పరపాలన, పరుల దోపిడి, దాస్య జీవనం, శాంతరహిత మనఃతత్వం, అసఖ్యత, అనైక్యత, అసహనం, అవిజ్ఞాన కరమైన విద్య కారణంగా స్వతంత్ర భారతదేశ దీశాత్వం భ్రష్టు పట్టింది. వర్ణకుల వృత్తులు పోయాయి. అధికులు దళితులు అనే వ్యత్యాసములు వచ్చాయ్. గ్రామములు, గ్రామీణ వృత్తులూ, కాడి పట్టి దున్నే కర్షక విధానమూ, అహింసా సూత్రం, కలిసే బ్రతికే కలిమిడైన మనసు, ఉమ్మడి కుటుంబాలు, పెద్దల పట్ల వినయ విధేయతలు మానవులంతా ఒకటేననెడి సమతా, మమతా, సఖ్యతా, సహృదయతా, సౌభ్రాత్రతాలు అంతరించాయ్. నైతిక విలువలు కల రామరాజ్యంగా ఖండాతర ఖ్యాతి గాంచిన ఒకే ఒక దేశం భారతదేశం, అలాటి భారతీయులూ విభజన సారాన్ని ఒంటబట్టించుకుని ఎవరికి వారుగా జీవమనుగడ సాగించాలనే అనైక్యతకు చిగుళ్ళు తొడిగారు.

పవిత్రమైన వేదాలు ఎలా నడుచుకోవాలో వందుకుని తినడం నుంచీ, శతంజీవిగా జీవించమని చెప్పినదీ, పురాణ ఇతిహాస, నీతి శకతకాలు మను చెప్పినదీ, పురాణ కాకమ్మ చిలకమ్మ కథలుగా కొట్టిపారేసారు. సదుద్దేశంతో విభజింపబడిన భాషా రాష్ట్రాలు తమ తమ భాషా సంస్కృతీ సాంప్రదాయాలను సంరక్షించుకోకుండా, దురుద్దేశంతో సంక్షోభానికి దారితీసే వైషమ్యాలకు ఆజ్యం పోస్తున్నారు. చిన్న ఉద్యోగుల్నుంచీ, పెద్ద పెద్ద మంత్రుల వరకూ అవినీతి అలుముకుపోయింది. అభివృద్ధి కుంటుపడిందనడం కన్న కృశించిపోయిందనే చెప్పాలి. మధ్యతరగతి ప్రజలు వధ్యశిలపై ఉన్నారు. హిందూమతం – హిందూదేశం – హిందూ ధర్మములను పదములు మూడూ ఒకరు పేరు పెట్టినవి గావు. ఒకరిచే స్థాపింపబడినవి కావు. ఇవన్నీ స్వయంభువపదాలే! హిమాలయములకు దక్షిణమును, మూడు మహా సాగరములచే చుట్టబడి, మధ్యనున్న దివ్యపాదాకారములా ద్వీపదేశము నంతటినీ హిరణ్యగర్భముగా వర్ధిల్లినది. హిరణ్యము (బంగారం) దేశము నందు ఎక్కువగా లభించుట వలన హిరణ్యగర్భగా వర్ధిల్లింది. శిరో భాగమని పర్వతములపై సర్వా సర్వవేళలందునూ రజితముల వలె మంచుకప్పి ఉండుట వలన శిరోప్రతిష్ఠిత హిమబిందువులు మూలంగా వెండికొండ అనేవారు. ఆ వెండి కొండపై కైలాసగిరి శివపార్వతులున్నారనెడి విశ్వాసం భారతీయుల మనసునందిప్పటికీ ఉన్నది. మానసరోవరం వెళ్ళిన వారు అక్కడకు వెళ్ళాలని ప్రయత్నించే విఫలులవుతున్నారు. నిజానికా పవిత్ర ప్రదేశములు చైనా అధికారంలో ఉన్న టిబెట్‌లో ఉన్నాయ్. ఇలా పలు ప్రదేశాలు అన్యాక్రాంతమయ్యాయి. అక్కడున్న మన వారు ఎప్పుడో ఆ దేశ సంప్రదాయాల్లో కలిసిపోయారు.

మహర్షులు దర్శించిన సత్య విషయం చెప్పాలంటే హిమాలయములకు పైనున్నదంతా జలప్రదేశం జలమయమే! వైవస్వత మనువు యొక్క ప్రస్తుత మానవుడు, భూమిపై ఆవిర్భవించిన నాటి నుండీ మేరుదండమైన ఈ భూమి నాలుగు పర్యాయములు కల్లోలితమగుట, తిరిగి సర్దుబాటవుట జరిగినది.

ప్రతీ మన్వంతరములోనూ, మానవ జాతి యొకటి ప్రత్యేకత లక్షణములు కలిగియున్నది. ఇప్పుడు జరుగుతున్నది ఏడవ మన్వంతరమైన వైవస్వత మన్వంతరం. ఆ కాలములో కొన్ని భూఖండములు లేనేలేవని తెలియుచున్నది. అవి అన్నియు సముద్ర గర్భముననే ఉండెడివి. ఇప్పుడున్న ఆసియాలోని దేశాలు అప్పుడు లేవు. ఆఫ్రికా గానీ, అమెరికాగానీ లేవు. హిమాలయములకుత్తర భాగమంతయూ జల సాగరమే. ఆ జల ప్రదేశానికి కావల తామరాకు వంటి ఆకారాము గల శ్వేత దీపం ఉండెడిదని ద్రష్టల విశ్వాసం. అది ఒక పెద్ద భూఖండం. తామరాకు వంటి ఆకారములో ఉండేది. పూర్వయుగములోని వారు అట్లాంటిక్ పసిఫిక్ సముద్రములుంటున్న భూఖండం మొత్తాన్ని భారతీయులు పాలించిరి. ప్రపంచ దేశాలు కన్ను తెరకవ మునుపే, శ్వేతవరాహకల్పము నుండే – అనగా వరాహమూర్తిగా నారాయణుడు తన ముట్టెతో భూమిని పైకి ఎత్తినట్టు పురాణం కూడా విశదమొనర్చింది. అందుకే శ్వేత వరాహ కల్పే వైవస్వతమంతరే జంబూ ద్వీపే, భరత వర్షే, భరతఖండే మేరుదిగ్భాగే అని భారత భూప్రవర చెబుతున్నాం. ఇప్పుడాయా ప్రాంతంలోని దీవులు సముద్రమున మునుగుచున్నవి. ఈస్టర్ ద్వీపము అతి ప్రాచీనమైన మూడవ మన్వంతర కాలంలోని దంటారు. ఇది అగ్ని పర్వతముల పెళ్ళగింపుతో చిన్నభాగం బయట పడినదని, ప్రాచీన యుగపు విగ్రహములు బయటపడినవనీ, ఇది లెమూరియా ఖండమనీ, ఇప్పుడు ఆస్ట్రేలియాలో నివసించు జనుల్లో మూడవతరం వారున్నారంటారు. పసిఫిక్, అట్లాంటిక్ సముద్రాలు ముంచెత్తిన కాలోల్లో ఎన్నో దేశాలు జలసమాధయినట్లు చెబుతారు.

ఏ చరిత మెలాగున్నా – మొట్టమొదటి భూఖండం అప్పటినుండి ఇప్పటివరకూ మునగకుండా ఉన్నది. పెద్ద పెద్ద పర్వతపంక్తులు పెల్లుబుకుట వలన భూ ఆకృతి మారుతూ వచ్చింది. రామేశ్వరం వద్ద శ్రీరామునిచే నిర్మింపబడిన సేతువు మునిగి నది. రామేశ్వరాలయానికే ముప్పు రాలేదు. గుజరాత్‌లోని శ్రీకృష్ణ నిర్యాణాన్తరమ్ ద్వారక మునిగినది. మరల తేలినది. ఈమధ్య ఓ తెలుగు రచయిత్రి ద్వారకను సందర్శించి, అన్ని పురాణాల్లో చెప్పినట్టున్నదని వ్రాసారు. నారాయణుడు అనేక అవతారములు ఎత్తుటవలన ధర్మం పునఃప్రతిష్ఠతమవుతూంది. మరల రాక్షసత్వం, అవినీతి, దోపిడి భారతీయత దిగరూరుదుతనం, హిందూ మతంపై ద్వేషం, వృత్తి కులాలు సంకరం చెందడం, అవినీతి అంగుళం నేలనైనా విడిచిపెట్టకుండా ఉండ డంతో సత్యధర్మత్యాగి పునఃస్థాపన మెప్పుడు జరుగుతుందో అనూహ్యంగా ఉంది. ●

## బంద్‌లను బంధించే నేతలు లేరా? ఇక పుట్టరా!

**- అధిక ధరలు, బందులతో పౌరులను ఆ చెంపా ఈ చెంపా వాయిస్తున్నారని ప్రజానీకం గ్రహించడంలేదు!! -**

ఆంధ్రప్రదేశ్ గత రెండు సంవత్సరాలుగా చీకటి తెరల్లోకి వెళ్ళిపోయింది. కోలుకోలేనంత నష్టాన్ని కొని తెచ్చుకున్నది. దీనికంతా కారణం అధికార దాహం, పదవుల దోబూచులాట. ఎవరికి ఎవరూ తక్కువ కాదు, అందినంతా బొక్కుకున్నారు. అక్కడి వరకూ బాగానే ఉంది. ఈ బంద్‌లు ఏంటిటి? మూలిగే నక్కపై తాటిపండు పండినట్లుగా, జనాన్ని తిరగనీయకుండా, ఉన్న అపారమైన ప్రకృతీ సంపదను, వనరులను, వసతులను నాశనం చేసి, స్మశానాలుగా తీర్చి, శవాలపై కూడును తిందామనా?

కిందవాడినుంచీ, పైవాడి వరకూ దోపిడీయే! సంపదలను దోచుకోవడమే! పోనీ దానితో సరిపెట్టుకున్నారా? బంద్‌లంటూ బస్సులను తగలపెట్టారు. రైళ్ళు కదలనీయకుండా, రైలు పట్టాలపై పడుకున్నారు. విద్యార్థులను చదవనీయకుండా ఉద్యమాల్లోకి దింపారు. పోలీసులపై రాళ్ళు రువ్వారు. వాళ్ళు ఆత్మరక్షణ కోసం మూకను పిట్టలు కాల్చినట్లు కాల్చారు. నాయకులెవరూ చావలేదు. ఉద్యమాల్లోకి అమాయకులను పంపి, వాళ్ళ చావుకు నాయకులే కారకులయ్యారు. ఉపాధ్యాయులు ఇదే ఛాన్సు అనుకుని తరగతులకు రాకుండా పోయారు. పాఠశాలలు మూసివేసారు. మేమేమి తక్కువని డాక్టర్లు ఆసుపత్రులకు రాకుండా పోయారు. కార్మికులు విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా గాకుండా చేసారు. విద్యుత్ కేంద్రాలను పనిచేయకుండా చేసారు. ఆదాయం రాకుండా కోట్లమీద నష్టం. వీధులూడ్చేవారు రాకుండా చెత్త పెరగడం, వ్యాధుల విజృంభణ. ఒక రోజా రెండు రోజులా 40, 60 రోజులు రాష్ట్రం కుదేలయిపోయింది. ఇదే సమయంగా తలచి చిల్లర వ్యాపారులు కాయగూరలు పెంచేసారు. చేసివన్నిటినీ మరిచిపోయి, చేవలేని ప్రభుత్వం, కరెంటు యివ్వని ప్రభుత్వం, నీళ్ళివ్వని ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అంటే ఎలా నిభాయిస్తుంది.

ఇహ కేంద్ర ప్రభుత్వానికి ఎప్పుడూ రాష్ట్ర బాగోగులు చూసింది లేదు, పెట్రోలు, గ్యాస్, డీసెల్ ధరలు పెంచడం తప్ప, మరొక కార్యక్రమం లేదు. పెట్రోలు, డీసెలు పెంచినందువలన ఎన్నెన్ని పెరిగి పౌరులను కష్టాల పాలు చేస్తాయన్న ఆలోచన లేదు. వీటన్నిటినీ చూస్తూ ప్రజల బాధలు కంటూ బంద్‌లా? ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అంధప్రదేశ్ అయింది. ఇంకా ఇంకా బూడిదపాలు చేస్తారా? ఆలోచించండి.

# -తాంబూలం ప్రతి గృహ్యతామ్-

**- తెలుగు పెద్దలు అనేక మర్యాద సొగసులు నేర్పారు! -**

**- సంస్కార ప్రియత్వమే తెలుగు సాంప్రదాయం!! -**

ప్రప్రథమంగా చెప్పుకోవలసినది అతిథి సత్కారం. ఆత్మ గౌరవానికి భిన్నంగా గాకుండా అతిథిని గౌరవించడం. మాటల్లో, చేతల్లో, చూపుల్లో మృదుత్వం కనిపించాలి. భగవంతుణ్ణి కూడా ముందు తాంబూలం సమర్పించిన తరువాతనే పూజకుపక్రమిస్తాం. అతిథి భోజన అనన్తరం తాంబూలపళ్ళెం దగ్గర పెడతాం. ఏ పుణ్యాపుణ్యకార్యములు జరిగిననూ తాంబూలానిదే ప్రథమస్థానం.



తమలపాకులు, వక్కలతోబాటు, ఫలం, పుష్పం కూడి ఉంటేనే తాంబూలం అవుతుంది. పండితులు, పురోహితులు, పరమాత్ములకు దక్షిణగా రొఖ్ఖం, ఫలం, తమలపాకుల మధ్య నుంచి యివ్వడం ఓ గౌరవం.

ఇప్పుడీ వర్తమాన వక్రీకృతయుగంలో జాతి, కులం అంటూ సాంప్రదాయాలు ప్రక్కన పెట్టారుగానీ, ఆనాడు పెళ్ళిళ్ళు చేసినపుడు బంగారుపనిచేసే కంసాలి (విశ్వబ్రాహ్మణులు) యింటికీ సుమంగళులు, ఇంటిపెద్దలూ, పళ్ళెములో తాంబూలం పెట్టుకుని, మంగళవాయిద్యములతో వెళ్ళి, సాంప్రదాయబద్ధంగా, అతనికి గౌరవం యిస్తూ, వధువుకు కట్టే మంగళసూత్రం, వెండిమట్టెలూ, నల్లపూసల గొలుసు, వరునికి వెండి జంధ్యం తీసుకునేముందు దక్షిణతో (మజూరీ) తాంబూలమిచ్చి, తిరిగి పెండ్లి గద్దెకు రావడం ఉండేది. అలాగే మంగళ్ళు (నాయీ బ్రాహ్మణులు మంగళవాయిద్యములు వాయించడానికి నిర్ణయిస్తూ, బజానాగా తాంబూలంలో పెట్టి యివ్వడం ఉండేది. అలాగే పల్లకీ మోసే చాకళ్ళకు బజానాగా తాంబూలంలో పెట్టి యివ్వడం ఉండేది.


పెళ్ళి నిశ్చితార్థములు, పెళ్ళిలో ఎదురు సన్నాహంలో వియ్యాలవారు ఒకరినొకరు తాంబూలములిచ్చి పుచ్చుకోవడం శుభప్రద ఆచారం.

'జంధ్యాల' గారొకచోట తాంబూలాలు యిచ్చేసాను. 'ఇహ మీరు తన్నుకు చావండి' అనిపిస్తారు. తాంబూలమనేదొక ఘట్టి నిర్ణయమన్నమాట. విందులూ, వినోదాలు చేసినపుడు, ఫలహార భోజనములైన తరువాత తమలపాకు వక్కలు, సున్నం, లవంగం, ఏలకులు కూడా యివ్వడం భారతీయ సాంప్రదాయం.

ఒకసారి ఒక పండితుణ్ణి ఆకాశవాణి కేంద్రంలో వేదపఠనం చేయడానికి వచ్చారు. ఏంవి యిస్తారన్నది ఆయన ఎరుగడు. అధికారిని మెల్లిగా మర్యాదగా "తెలియక అడుగుతున్నాను" మాకు తాంబూలంలో ఏమిప్పిస్తున్నారని అడిగారు. ఆయన ఇంత ఇస్తున్నామని చెప్పేసరికి పండితుడు సంబరపడిపోయాడు. నాకెంతిస్తారు అని అడగకుండా అలా అడగడంలో అధికారి గౌరవంగా భావించారు.

అందుకే శుభకార్యాలలో దేవుని కార్యక్రమాల్లో వ్రతాలూ పూజలలో "పూగీ ఫలచూర్ణ సంయుక్తం! తాంబూలం ప్రతిగృహ్యతాం' అంటారు. (పోకవక్కలు, పళ్ళు తమలపాకులు పచ్చకర్పూరం కలిగిన తాంబూలం తీసుకొందురుగాని అని అర్థం. ఏ శుభకార్యసందర్భాలు రానీయండి పండు, తమలపాకులు, ఓ చివర సున్నం రాసో, సున్నం డబ్బా పళ్ళెంలో పెట్టి ఇస్తారు. పచ్చతోరణం కట్టిన యింట్లోని అతిథులకు తాంబూలం యివ్వడం సాంప్రదాయం ఆచారం. ఈ ఆచారం భారతదేశంలో రెండువేల సంవత్సరాలపై చిలుకుగా సాగుతూ వస్తున్నది. అమెరికాలో వంటి పాశ్చాత్యదేశాల్లోని భారతీయులు ఈ మంగళదాయకమైన ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. తమిళనాడులో అయితే ముప్పొద్దులా తాంబూలం వేసుకోని వారుండరు. ●

## కమల్‌ని కదిలించిన రాజబాబు



ఉప్పులేని కూర ఎలా ఉంటుందో.. రాజబాబు లేని సినిమా అలా ఉంటుందని అప్పట్లో ఓ నానుడి ఉండేది. ఒక చిత్రం విడుదలైతే ఆ సినిమాలో రాజబాబు ఉంటేనే ఆ సినిమాను కొనేవారు డిస్ట్రిబ్యూటర్స్. ఆ రోజుల్లో రాజబాబు అంటే అంత క్రేజ్ మరి. పిట్టకొంచెం కూత ఘనం అనే సామెత ఆయనకు అక్షరాలా అమరిపోతుంది. ఆయన తెరపై కనిపిస్తే చాలు ప్రేక్షకులు పడిపడి నవ్వేవారు. ఇక డైలాగులు చెప్పినా... హావభావాలు పలికించినా కితకితలు పెట్టినట్టే ఉంటుంది. ఆయన ప్రేక్షకుల్ని ఎంతగా నవ్వించారో... కొన్ని చిత్రాల్లో అంతగానూ ఏడిపించారు. ముఖ్యంగా ఆయన నటించిన 'ఎవరికి వారె యమునా తీరె' చిత్రం రాజబాబు నట జీవితంలో ఒక ఆణిముత్యం లాంటిది. ఆ చిత్రంలో ఆయన మూర్తీభవించిన మానవతావాది పాత్రలో జీవించారు. తనను దరిద్రపు మోహమని... శని అని సొంతవారే అంటుంటే లోలోపలే కుమిలిపోవడం... తన సొంత బంధువులే తనను అమ్ముతుంటే ఆ పాత్ర పడే బాధ.. తాను ప్రేమించిన అమ్మాయికి కళ్ళు తెప్పించి మరొకరితో ఆమె పెళ్లి నిర్ణయించడం. తనకు క్యాన్సర్ అని తెలిసి ఆ విషయాన్ని తనలోనే దాచుకుని కుమిలిపోవడం... ఇలా రకరకాల భావాలు గల ఆ పాత్రలో వైవిధ్యాన్ని ప్రదర్శించిన తీరుకు థియేటర్లో చప్పట్లు పడ్డాయి. ఒక డిగ్లామర్ పాత్రలో, ఫైట్లు, డ్యూయెట్సు, అందమైన లోకేషన్స్ వంటివి ఏవీ ఉండవు. అయినా ఆ చిత్రం ఎంతో విజయాన్ని సాధించింది. ఇదే పాత్రను హిందీలో కమలహాసన్ ఏరికోరి మరీ నటించారు. అంటే ఆ పాత్ర ఎంతగా కమల్‌ని కదిలించిందో అర్థం చేసుకోవచ్చు.

# మద్రాసు తెలుగువారి జవసత్వాలతో నిర్మితమైంది!

## -తెలుగువారల త్యాగభూమి! తెలుగుల రక్తమాంసాలు సూర్యకిరణాల్లా భాసిల్లుతూనే ఉంటాయ్-

## అమరజీవి పొట్టి శ్రీరాముల ఆత్మాహుతే నిదర్శనం!



పొట్టి శ్రీరాములు దీక్ష చేపట్టిన భవనమిదే

క్షణం నిరీక్షిస్తే నెత్తురి బొట్లు, నేల అణువు అణువునూ తడిపి, రక్తవర్ణంగా మారిపోతుందేమోనని, భారత ప్రధాని మనసుకి మంటలు రేగెత్తించిన రోజు.

అది 1952 సం॥ము డిసెంబరు15వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో, అనగా ఆయన నిరాహారదీక్ష చేబట్టిన 58వ రోజున పొట్టిశ్రీరాములగారి ప్రాణాలు అనంత విశ్వ విభువునిలో కలిసిపోయాయి. ఈ విషాద వార్త చంద్రమండలంలో ఉన్న వ్యోమగామి వరకూ వెళ్ళిపోయింది. తెలతెలవారకముందు, పుష్పాలు విరిసీ విరయక ముందే ఈ వార్త విశ్వమంతా విదితమైపోయింది. వందల కొలది సంవత్సరాలు, వేవేల కొలదీ తెలుగువారు ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం చేసిన సమరం 58 రోజుల నిరాహారదీక్షకు మహాప్రస్థానమైంది.



ఊపిరంతా బిగపెట్టి, ఊరంతా చుట్ట చుట్టి నరసింహస్వామిలా ఉగ్ర రూపంలో ఉండే ఆకాశం సూర్యోదయ తూర్పమే నింగీ నేలా ఎర్రబడింది. దేశం నలుమూలలా ఉద్రేక వాతావరణం రగుల్కొంది. నాయకులంతా ఒకటి అయ్యారు. ఆంధ్ర ప్రాంతాల్నుంచీ ఏ వాహనాలు దొరికితే ఆ వాహనాల్లో ప్రజలంతా మైలాపూర్ చేరుకోవడంతో మైలాపూర్, మద్రాసులోని అనేక ప్రాంతాలు జనసాగరమైంది. ఈ జనసునామీ ఉద్రిక్తను పసిగట్టిన ప్రధాని నాలుగే నాలుగురోజుల్లో అనగా డిసెంబర్ 19నే తెలుగు మాట్లాడే ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం యిస్తున్నామని ప్రకటించారు. చరిత్రలోనే ఇంత మహోధృతంగా, నిరాహారదీక్షను చేసినవారు లేరు. దీక్ష ప్రారంభించిన నాటి నుంచీ ఆత్మార్పణం కావించిన రోజుకు 45 నుంచీ 50 పౌనుల దేహం శుష్కించుకుపోయింది. మహర్షి బులుసు సాంబమూర్తి డా॥ కస్తూరి నారాయణమూర్తి గారు శ్రీరాములు కనిపెట్టుకొనే ఉన్నారు. 55 రోజు సమీపించి, శ్రీరాములుగారి దేహపరిస్థితి చివరిదశకి వచ్చిందని గ్రహించిన డా॥ కస్తూరి నారాయణమూర్తిగారు రాత్రి 11 గంటలకు వచ్చి శ్రీరాములుగారిని దీక్ష విరమించమని ప్రార్థించడం, శ్రీరాములు గారు తమకు దీక్షా భంగం చేయవద్దనీ తన అంగీకారం లేకుండా ఎలాటి చికిత్సలూ చేయవద్దనీ, ప్రాణం నిలిపే పని చేయవద్దనీ, అసువులు తన్ను వీడితే, జనులెవరు హింసాత్మక దౌష్ట్యచర్యల వద్దన్నది తన అభ్యర్ధనగా ప్రజలకు విన్నవించమనిన అహింసామూర్తి.

### గాంధేయవాది

పొట్టి శ్రీరాములు మద్రాసు నగరంలో జన్మించారు. చిన్నతనం నుంచే అహింసా మార్గంపై ఎనలేని విశ్వాసం. ఈ క్రమంలోనే మహాత్మాగాంధీకి వీర విధేయుడిగా మారారు. తెలుగు వారు 1950 సమయంలో మద్రాసు నగరంపై పట్టు కోల్పోతుండడం శ్రీరాములుగారి మనసును నొప్పించింది. తెలుగు వారి నగరమైన మద్రాసుపై తమిళుల ఆధిపత్యం పెరుగుతుండడంతో మనస్థాపం చెందారు. మద్రాసు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించాలని సంకల్పించారు. ఇందుకు టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి మహామహులు పూనుకోవాలని ఆయన భావించారు. అయితే అందుకు పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో పొట్టి శ్రీరాములే దీక్షకు సిద్ధమయ్యారు. తనకు అత్యంత సన్నిహితుడైన భాగవతుల లక్ష్మీనారాయణకు ఉత్తరం ద్వారా ఇలా తెలియజేశారు. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు పుట్టినిల్లైంది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. అందరూ పరమార్ధ దృష్టితో ఆలోచించినవే తప్ప ఏకాభిప్రాయానికి రాలేదు. అధికారంలో ఉన్న మహానాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేషరహితంగా నిశ్చింతగా ప్రాణాలను అర్పించడమే. ఇంకా ఈ సమస్యను ఉపేక్షించుట పాపమని నాకనిపిస్తోంది" అని పేర్కొన్నారు. దీక్ష చేసేందుకు ఎక్కడా అనుమతి లభించక పోవడంతో పొట్టి శ్రీరాములు నిరాశ చెందారు. ఈ విషయం మహర్షి బులుసు సాంబమూర్తికి తెలిసింది. మైలాపూర్ లజ్ కార్నర్‌లోని తన నివాసంలో శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్షకు స్థానం కల్పించారు. అలా 1952 అక్టోబరు 19వ తేదీన ఆత్మారణ యజ్ఞానికి అంకురార్పణ జరిగింది.

### ఆయన డిమాండ్లు

తెలుగువారి సంక్షేమమే ధ్యేయంగా కూడిన డిమాండ్లతో పొట్టి శ్రీరాములు దీక్ష చేపట్టారు. మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడేలా కేంద్రం చర్యలు చేపట్టాలి అన్నారు.

### అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ మిషన్

మద్రాసులో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం చేసిన ఇంటిని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మిషన్ 1985 సంవత్సరం నుంచి అమరజీవి పొట్టి శ్రీరాములు సొసైటీగా రూపాంతరం చెందింది. నగరంలో తెలుగు సాహిత్య సేవకు నిలయమైంది. మద్రాసు నగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన స్థలం ఇదొక్కటే! ●



# చెన్నపట్నంలో తెలుగుదనానికి వెలుగు దన్నులైన తెలుగు సంస్కృతీ వేగుచుక్కలు ఒక్కటొక్కటిగా జారిపోతున్నారు! -2012, తన ప్రళయ వాసనలను విరబూసింది-



ఆంధ్రరాష్ట్రం సిద్ధించిననంతరం, తెలుగు సినిమా పునాది వేళ్ళనుంచీ త్రెంచుకుపోయినప్పటికినీ కళాహృదయం కల డా॥ వెంపటి చినసత్యం మరణం చెన్నయ్ తెలుగువారినే కాదు, భౌగోళికంగా ఉన్న కూచిపూడి నృత్యమణులను కలచివేసింది.

కూచిపూడి నృత్యం తెలియని వారినీ, కూచిపూడి నృత్యం శాస్త్రీయనృత్యం కాదన్న వారినీ, నోళ్ళు మూయింపచేసినవాడూ, నూరూరాస్మరింపచేసినవాడు డా॥ వెంపటి చినసత్యమే! ఎవరూ కాదన్నా ఎల్లలు దాటిన సత్యం. సిద్ధేంధ్రయోగియే వెంపటి చిన్నసత్యం అన్న సత్యం నా మనమెరిగిన సత్యం, లక్షలూ, కోట్లాది అభిమానుల విశ్వాసమన్నది సత్యం.

వెంపటి చినసత్యానికీ, నాకు ఆరుదశాబ్దాల సంబంధం. రేలంగి వెంకటరామయ్య, యాళ్ళధనరాజు నిర్మించిన 'సమాజం' చిత్రానికి, వెంపటి చిన సత్యం నృత్యదర్శకుడు, నేను ఆ చిత్ర నిర్మాతల హితుణ్ణి, స్నేహితుణ్ణీ, పి.ఆర్.ఓ (ప్రచారకర్తని). మేమిద్దరమూ హోలీ ఏంజెల్ పాఠశాల (దీనికి ఎదురుగానే నిర్మాతల కార్యాలయం ఉండేది) నుంచీ పానగల్ పార్కు వరకూ పాదయాత్ర చేసేవాళ్ళం. అదేంవి మహత్మ్యమోగానీ, పానగల్‌పార్కు నంటుకుని ఉండే ప్రకాశం రోడ్‌లో విశాలస్థలంతో కూడుకుని ఉన్న భవనంలో కూచిపూడి ఆర్ట్ అకాడమీ స్థాపింపబడింది. జంట చిత్ర నిర్మాతలూ పంపిణీదారుల్లో ఒకరు నిడమర్తి సత్యంగారి క్రింద లీజులో ఉండిన ఆ భవనాన్ని కూచిపూడి నృత్య శిక్షణం కోసం యిచ్చారు. నిడమర్తి సత్యంగారమ్మాయి ఎం.ఎస్.నాయక్‌గారి కుమార్తె కూచిపూడి నృత్యానికి అక్షఱ స్వీకారం చేసిన తొలిస్థలమది. చంద్రకళ (ఎం.ఎస్.నాయక్‌గారి అమ్మాయి) నృత్యతారా సిరి విరిసిన ఆమె సినిమా రంగంలో తారాస్థాయికి ఎదిగిపోయింది. అలానే హేమమాలిని, రేఖ, ప్రభ, మాధవపెద్దిమూర్తి- ఇలా వివరించాలంటే సహస్రాధిక నృత్యాచార్యులు, నృత్య చారిణులు, నర్తకులు నర్తకీమణులను లెక్కించడం సాధపడనిది. నక్షత్రాలనైనా లెక్కించగలం. వెంపటి చినసత్యం దగ్గిర శిక్షణ పొందిన వారిని చెప్పలేము. విశ్వమంతా కూచిపూడి నృత్యమయం చేసిన వెంపటి చినసత్యం నిరాడంబరుడు, నిజాయితీపరుడు, కళాకారుడూ, నటుడూ, పూర్వపు ముఖ్యమంత్రియైన ఎం.జి.రామచంద్రుడు కూచిపూడి నృత్యానికి అబ్బుర పడి చెన్నయ్‌లోని నీలి సాగరతీర ప్రశాంత వాతావరణంలో ఓ మంచి వాస స్థలాన్నిచ్చారు. నీలిఆకాశం, నీలిసాగరం వ్యాపించి, వ్యాప్తినొందినంత మేరకు కూచిపూడి కళ ఎదిగిపోయింది. నటరాజు సత్యం కీర్తికి మురిసో, వెరచో తనలో కలుపుకున్న 2012 సం॥మును నిందించకుండా ఉండలేకపోతున్నాను. అంతటి ఘనకీర్తి నొందిన తెలుగు కళాకారుడు చెన్నయ్‌ను విడువకుండా చివరి శ్వాసవిడువడం, తానున్న భూమికి నివాళులర్పించడమే!

(బువ్వపెట్టి, బుగ్గమీసాలు నెరిసేవరకూ చెన్నయ్‌లో నుండి, స్వలాభం కోసం భాగ్యనగరం వెళ్ళిన కృతజ్ఞతారహితలలైన వారికన్నా- ఇక్కడే ఉండి, ఈ మన్నుకు సేవచేసిన వారంటేనే ఇష్టపడతాను. ఆంధ్రాహాలీవుడ్‌గా విశ్వవిఖ్యాతిగొన్న చెన్నయ్ లోని సినిమాస్టూడియోలు, సన్నకారు నిర్మాతలు, పని వారలనస్తమింపచేసిన వారిని గర్హిస్తాను)

* * *

చెన్నపురి ఆంధ్రమహాసభ చిరునామా చెరగకుండా, 'చివరిశ్వాస' వరకూ స్మరిస్తూనే చెన్నపురి ఆంధ్రమహాసభలా టి.జి.కమలాదేవి చిరునామాను చెదరకుండా చేసుకున్న స్త్రీ(భీష్మ)మణి'

ఎంత చక్కటి మనిషో అంత చిక్కటి మనసు. మూర్తీభవించిన నటీమణీ! మూర్తీభవించిన తెలుగు అభిమానధనురాలా? అంటే సమాధానం దొరకదు. పాత్రములో, గాత్రములో, ధారణములో, క్రీడల్లో, నాటకప్రదర్శనా, నిర్వహణములో, భాషా ప్రియత్వంలో టి.జికమలాదేవి నీడకు కూడా సరిపడువారులేరు.



## చెన్నయ్‌లో వీరి లేని లోటు తీర్చలేనిదిగా 2012 దూసుకువచ్చింది!!!

**తూరుపు బలబల తెల్లవారెను**
**తోకచుక్కయు, వేగుచుక్కయు**
**ఒడయుడే వేవెల్గు కొలువుకు**
**వెడలి మెరిసిరి మిన్నువీధిని"**

-అన్నట్లు- మనం వెలుగుచుక్క, వేగుచుక్క, తోకచుక్కలుగా చెన్నపట్నంలో షోడశకళలతో ఎవరికి వారే ప్రత్యేకతను సంతరించుకున్న పెద్దమనసులను 2012 సం॥ము పొట్టను పెట్టుకోవడం,ఎనలేని సంతాపకారణమైంది.

కూచిపూడి నృత్యాన్ని అనంతవిశ్వంలో వ్యాప్తి నొందింప చేసిన కళాప్రపూర్ణ వెంపటి చినసత్యం లేరను మాట నృత్యకళాకారులను కలచివేసింది.

(తరువాయి 24వ పేజీలో)

# పశ్చాత్తాపుడయ్యే వాడికి ఈ ప్రపంచం ట్రాజెడీ! హుషారుగా వ్యవహరించే వాడికీ ప్రపంచం కామెడీ!

## - మడిసన్నాక కాస్త కళాపోషణ ఉండాలి అన్నారు బాపూరమణులు -

రాజకీయ నాయకులు కూడా రవ్వంత హాస్యగుళికలు రువ్వుతూంటారు- ఇది గతం ఇప్పటివాళ్ళు రాళ్ళు రువ్వుకుంటున్నారు- గతం ఖతం



మహాత్మాగాంధీ మధ్యా, తెలుగువారి ఆడపడుచూ సరోజనీనాయుడు మధ్య జోకులు ఉరుములూ, మెరుపుల్లా ఉరకలేస్తుండేవి. స్వతంత్ర్య పోరాట రోజుల్లో సీరియస్ సమస్యల మధ్య వింతైన జోకులు ఫలిస్తూండేవి. గాంధీగారిని ఆ నైటింగేల్ పిల్ల 'మిక్కీమౌస్' అంటూ పిలిచేది. ఆయనేమీ అనుకునేవారు కాదు, చిన్నగా నవ్వేవారు. ఒకసారి ఆమె గాంధీగారితో మీ నిరాడంబరత మా చావుకొచ్చింది. మిమ్మల్ని దరిద్రంగా ఉంచడం కోసం మాకు వేలూ, లక్షలు ఖర్చవుతున్నాయ్ అంటూ కస్తూరిబానిధికి 75 కోట్లు వసూలయింది. ఆ సొమ్మును గాంధీగారికి అందచేయమని సరోజనీ నాయుడుకిచ్చారు. ఆమె గాంధీ వద్దకు వచ్చి, ఈ డబ్బుతో నేను పారిపోతే అంది. నువ్వంతటి సమర్ధురాలివే! సరే ఇలా యిచ్చి వెళ్ళు. నీవు అంతపని చేసేదానివే అని నవ్వుతూ తీసుకున్నారు గాంధీ.

ద్వారం ఉండవలసిందే అన్నారు సువిఖ్యాత ఫిడేల్ విద్వాంసుడు ద్వారం వెంకట స్వామి నాయుడుగారు. కాకినాడ సరస్వతీ సభలో ఎందరో మహా మహా విద్వాంసుల సంగీత సభలు చేశారు. ద్వారం వారి వాయులీన వాయిద్యంపై నాదం నాట్యం చేసింది. ఫిడేల్‌పై ఆయన వేళ్ళూ కమాన్ కనిపించలేదు. కార్యక్రమానంతరం సభా కార్యదర్శి ప్రసంగిస్తూ, సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, అరియ కుడి సంగమేశ్వర శాస్త్రి వంటివారికి అరుదుగా లభించే ఈ అవకాశం ద్వారం వారికి దక్కింది అంటూ వందన సమర్పణచేసారు. నాయుడు గారికి చిర్రెత్తింది. కోపపడడం పెద్ద మనిషితనం కాదు. అందుకు ప్రత్యుత్తరం యిస్తూ- నిజానికి ద్వారం సంగీతం వినడం వీరి అదృష్టం. ఆయనకు నాదో మనవి. కార్యదర్శిగారు ఎందరో మహానుభావులు కచ్చేరీ చేసిన వేదిక అన్నారు. ఇదొక గొప్ప సంగీత సౌధం.కానీ ఎంతటి మహాసౌధానికైనా ద్వారం ముఖ్యం. ద్వారం లేని సౌధం నిరుపయోగం- అన్నారు. దానితో సభంతా కరతాళధ్వనులూ, ఈలలూ, రేరింతలు.ఇది పండితులకే అబ్బిన అపురూపలక్షణం.



(23వ పేజీ తరువాయి)

ఏళ్ళ చరిత్ర కలిగిన చెన్నపురి ఆంధ్రమహాసభ చిరునామాను చెరిగిపోకుండా చివరి శ్వాసవరకూ అదే ధ్యాసలోనున్న నటీమణి, గాయని, తెలుగుభాషాభిమాని, విశిష్టరంగ క్రీడాకారిణీ, చిత్తూరు వి.నాగయ్య చిద్విలాసప్రకాశవిలసితను ఇంతవరకూ నిలిపిన టి.జి.కమలాదేవిని కూడా చెన్న పట్నపు ధరణి తన కడుపులోకి తీసుకుపోవడం తీరని విచారం కల్గించింది.

❊ ❊ ❊

గుండ్రటి ముత్యములా మెరిసే తెలుగు అక్షఱ కార్యక్రమం ఎక్కడ జరిగినా అందు వాలి తన డెందము, తెలుగువారి డెందమును మకరందము విరియింపచేసే ఘనుడూ, ఘానపాటి. వృత్తి తంతీ నాద శాఖమైనప్పటికినీ, తెలుగు కార్యక్రమాలను జీవగర్రగా ఉన్న మత్రేయోభిలాషి, సర్వజనుల హితైషీ, సంస్కృతాంధ్ర భాషల అభ్యాసీ, వచోజ్ఞానవిరాశీ, శ్రీవాణీ గిరిజాశ్చలను గ్రహవాసియైన, శ్రీనివాసశతకాది పద్యగద్యహృద్యమూర్తి గూడపాటి శ్రీనివాసరావుని 2012 కాలం తన పొత్తిళ్ళతోకి తీసుకోవడం తీరని లోటు, తీర్చలేని లోటు.

❊ ❊ ❊

నవ్వుల పువ్వుల తేడు. ఎవ్వరూ అనుకరించలేని హాస్యానికి జోదు. హాస్యబ్రహ్మ జంధ్యాల సినిమారంగానికిచ్చిన హాస్యరాజు. అతనికతడే సాటి ఎవరూ నిలబడలేని మాటలరాఠి. ఎక్కువ చెబితే 'సుత్తి' అంటాడు. రావుగోపాలరావు తరువాత మాటల లాఠీపట్టుక్కు మేటి. అలాటి సుత్తివేలు దివికేగడం హాస్యప్రపంచానికి లోటు. అతడికి సీయస్సార్ అంటే ప్రాణం. ఆయన వాగ్విభవవాణి ప్రతి ధ్వనించడానికి నశ్యం పీల్చడం నేర్చాడు. నిరాడంబరుడు. హాస్యం పలుచనవుతున్న క్లిష్ట సమయంలో వీరభద్రరావుతో కలిసి 'సుత్తిజంట'గానూ, వీరభద్రరావుపోయిన తరువాత ఒక్కడే మిక్కుటంగా హాస్యపండించాడు. చార్లీచాప్లిన్‌పోతే మరల అలాటి చాప్లిన్ పుట్టనట్టు, సుత్తివేలు వంటి విలక్షణ నటుడు తిరిగి పుట్టడు.

రేలంగీ, రమణారెడ్డి హాస్యజంట అనంతరం వేలువీరభద్రరావుల జంటే, తన్నులూ, తిట్లూ ఒకరినొకరు దుయ్యకుండా ఉన్న జంటే ఇదే.

"సిగ్గూ ఎగ్గూ ఉన్న సన్యాసివయితే... ఇలా పిల్లల భోజనాల పద్దులో తలనొప్పి బిళ్లల ఖర్చు రాస్తావా?... చెప్పు ఎందుకొచ్చాయివి?" ఇల్లెగిరి పోయేలా అరిచాడు వీరభద్రయ్య. "అయ్యా... అవి నేను వేసుకున్నవండయ్య" భయంతో కూడిన వినయంతో కూడిన గౌరవంతో సమాధానమిచ్చాడు వేలు.


"చేతులతో చేస్తే రాదండయ్య... కానీ ఈ మధ్య నా చేతులకంటే చెవులకే పని ఎక్కువయిపోయిందండయ్య... మీ సుత్తి పుణ్యమా అని" సమాధానమిచ్చాడు వేలు.

30 ఏళ్ల క్రితం వచ్చిన 'నాలుగు స్తంభాలాట' సినిమాలోని ఈ డైలాగులు విని జనాలు పొట్టచెక్కలయ్యేలా నవ్వారు. గుర్తు తెచ్చుకుని మరీ నవ్వారు. ఇంకా నవ్వుతూనే ఉన్నారు. రాబోయే తరంలో కూడా నవ్వుతారు. అందు సందేహం లేదు. "ఏంట్రా సుత్తి" వేయకు అంటాం.

తెలుగువారి ముంగిళ్లలో ఈ 'సుత్తి' డైలాగులను కేసెట్లు కొని మరీ విన్నారు. సుత్తి జంట పూయించిన నవ్వుల పువ్వుల పరిమళాలు అలాంటివి. వీరభద్రరావు మనకు దూరమై 24 ఏళ్లయింది. తన ఆప్తమిత్రుడ్ని వెతుక్కుంటే సుత్తివేలు కూడా వెళ్లిపోయారు.

నటులు చాలామంది ఉంటారు. కానీ సున్నితహాస్యం మాత్రం కొందరికే స్వంతం. వారిలో సుత్తివేలు ఒకరు. మూడు దశాబ్దాల సినీ ప్రస్థానంలో సుత్తివేలు లక్షలాది మందిని నవ్వించారు. అలాగే ఏడిపించారు. ఒక్కోసారి కోపం తెప్పించారు. మరి ఇంతటి గొప్ప నటుడ్ని తెలుగు సినిమా సరిగ్గా ఉపయోగించుకుందా...? అని ప్రశ్నించుకుంటే మౌనమే సమాధానం అవుతుంది.

80ల్లో వేలు వేలుపెట్టని సినిమాలేదు. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, బాలకృష్ణ.. ఇలా హీరో ఎవరైనా కానీయండి. వేలు మాత్రం ఉండాల్సిందే. ఒకానొక దశలో తార స్థాయిని తాకారు వేలు. ఇప్పుడు సరాసరి తారామండలికి వెళ్ళిపోయారు. ●




# - ఆర్యవైశ్య ధర్మం అభివృద్ధిరస్తు - ఆచంద్రతారార్క కీర్తి వర్ధితమస్తు ! -
# - పబ్బిశెట్టి రాఘవయ్య ఛారిటీస్ సహస్ర వర్ష ప్రవృద్ధిరస్తు -

అది ఒక మంగళకరమైన రోజు. మంగళాంబిక వాసవీ కన్యక పరిపూర్ణాను గ్రహం పొందిన రోజు. 'ధర్మో రక్షిత రక్షితః' అన్నట్టు ఆర్యవైశ్య కుల ఆచంద్ర, తారార్క కీర్తి ప్రతిష్ఠాభివృద్ధిరస్తు' అన్నట్టు పాలులో మజ్జిగ చుక్కవేసి, తియ్యనైన గడ్డ పెరుగుగా తయారించిన చందంగా, ఆర్యవైశ్యజ్ఞులు ఆర్షధర్మంలో వారి ధర్మగుణం తోడుపెట్టిన అందంగా అదరం, అదరం మధురంగా మునిగేట్టు, మందార మకరందం విరిసేట్టు, తమ ధర్మ, ధన, ధాన్యాగార సంపత్తితోబాటు, ధార్మిక సంపత్తిని కూడా నిలువెత్తున నిలుపు కొంటున్నారనడానికి సాక్ష్యం జరిగిన శ్రీ పబ్బిచెట్టి రాఘవయ్య చెట్టి ఛారిటీస్ యొక్క శతసంవత్సర వర్షహర్ష వార్షికోత్సవమునే చెప్పుకోవాలి. ధాన్యం, ధనం బహుపుత్ర లాభం అంటారు. కానీ యిక్కడ దానధనం బహు సంవత్సర వర్ధితమ్ అని చెప్పుకోవడం సబబు.




పబ్బిశెట్టి రాఘవయ్య చెట్టిగారి మూర్తినీ, స్ఫూర్తినీ, దాని గుణ విశిష్టతనూ, కళ్ళకు గట్టినట్టు 2012 సం॥ము ఆగష్టు 22వ తేదీన మద్రాసులోని మ్యూజిక్ అకాడమీ అంతర్హృదయ, విస్తీర్ణ విలసిత, విమల, కమల, సలిల వేదికపై, తమిళనాడు గవర్నరు కొణిజేటి రోశయ్య అగ్రాసినాధిపత్యాన, హరిద్రా కుంకుమల నేత, గోవింద, పరమానంద హృదయుడూయైన వై.హరికృష్ణ (అ)ధ్యక్షతన, నవమూర్తులైన విశ్వాసితులు (ట్రస్టీలు) వై.వి. హరికృష్ణుడు, ఉమ్మడి సుధాకరుడు, జి. బద్రీనారాయణుడు, జె.వి.పెరుమాళ్, ఎ.ఎస్.హరిప్రసాద్, వి.గోవర్ధన్, కోట సుధాకర్, నవనీత కృష్ణుడనబడే ఎం.కిషోర్‌గుప్త, శ్రీమతి వి.శాంతా శ్రీధర్‌లు కొలువుగా కొలువుతీరేసరికి ఈ సభ ఎంతకాలం ఉపన్యాసములతో సన్యాసమిస్తుందోనని భయపడిన నాకు హరికృష్ణ అధ్యక్షోప న్యాసం, కార్యదర్శి నివేదిక, రోశయ్య సభాధ్యక్షోపన్యాసం, వందన సమర్పణతో శతవర్షోత్సవ సభను సంక్షిప్త చమత్కృతంగా ముగించడం, అనంత వాయురాకాశంలో పుష్పక విమానం ఎక్కినంత ఆనందం కలిగింది. నృత్యగాన విదుషీమణి శ్రీమతి కృష్ణకుమారి నరేంద్రన్ సుశిక్షణంలో 'వెంకటాద్రి వైభవం' నృత్యహేలను తిరుమల ఆలయ దృశ్యమాలి కను సంధానపరుస్తూ ప్రదర్శించిన తీ(జో)రు ప్రేక్షకులందర్నీ తిరుమల సందర్శించునంత రసానుభూతిని కల్గించిన 90 నిముషాల కార్యక్రమం నభూతో నభవిష్యతే'నని చెప్పాలి. ఈ ట్రస్టు సేవలు వైశ్యులకే పరిమితం గాకుండా సమాజంలోని అన్ని వర్గాలనూ ఆదుకోవడం అద్భుతాల కద్భుతం.

అసెంబ్లీల పార్టీల వారిగా సీట్లు కేటాయించడం స్పీకరుకు కష్టమై ఉంటుంది కానీ, సభ్యాక్షుడు హరిచందన హృదయానందుడైన హరికృష్ణ సముచితమైన రీతిలో ఆహ్వానితులు ఉపవిష్టులగుటకు చేసిన సీట్లు బహుదా ప్రశంసనీయం. ●





# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

**సంపదలుకాని, పేరుప్రతిష్ఠలు కాని, గౌరవమర్యాదలు కాని, పాండిత్యం కాని పనిచేయవు. ప్రేమ ఒక్కటే నిలిచి వుంటుంది.**

**- స్వామి వివేకానంద**



మనిద్దరిమధ్య వున్న రుణానుబంధం వల్ల మనిద్దరం కలిశాము. మనం ఒకరినొకరు ప్రేమించుకొని, ఒకరికొకరుగా కలిసి మెలగుదాం. On Account of Rinanubandha that we have come together. Let us love and serve each other and be happy. ఇది సాయిబాబా సూక్తి. భగవంతుని లీలలు చిత్రవిచిత్రంగా వుంటాయి. ఎవరు ఎప్పుడు, ఎందుకు కలుస్తారో, ఎందుకు విడిపోతారో, ఎలా కలుస్తారో కూడా చిత్రంగానే వుంటుంది. ఈ ఫోటోలో వున్న వ్యక్తి పేరు లలిత్‌కుమార్‌సాహు, వయస్సు 65 సంవత్సరములు, వుంటున్నది ఒరిస్సాలోని భువనేశ్వర్‌కు 65 కిలోమీటర్ల దూరంలో నున్న కేంద్రపార అనే వూరు. ఆయనకు నాకు ముఖత పరిచయం లేదు. కాని మేమిద్దరం 3 సంవత్సరాలుగా స్నేహితులం. ఇంతవరకూ ఒకరినొకరు చూచుకోలేదు. ఆయనెవరో నేనెవరో కాని మా ఇద్దరిని కలిపినది ఆ సాయినాథుడు, అదే మరి ఎన్నో జన్మల బంధం అంటేనేమో. సరిగ్గా 3 సంవత్సరాల క్రితం ఈ లలిత్‌కుమార్‌సాహు, మైలాపూర్ సాయిబాబా గుడికి ఫోన్ చేసి హిందీలోనూ, ఇంగ్లీషులోనూ మాట్లాడుతూ Life of Sai Baba పుస్తకం పంపమని కోరారు. వారికి ఈయన భాష అర్థంకాక ఎన్ని ఫోనులు చేసినా సరైన జవాబు రాలేదు. ఆ పుస్తకంలోని రెండవ పేజీలో మా ప్రెస్ అడ్రస్, ఫోన్ నంబరు చూసి నాకు ఫోన్ చేసారు. అది ల్యాండ్‌లైన్ అయినందునవల్ల ఆయన ఫోన్ చేసినప్పుడు నేను కూడా దొరకలేదు. అయినా ఆయన విసుగు చెందకుండా మళ్ళీ మూడోసారి ఫోన్ చేసినప్పుడు నేను ఫోనులో దొరికాను. ఆయన మాట్లాడుతున్నప్పుడు నన్ను ఆకర్షించారు. నెమ్మదిగా, నిదానంగా, హుందాగా జరిగిన విషయాలన్నీ చెపుతూ బి.వి.నరసింహస్వామిజీ గారు వ్రాసిన Life of Sai Baba పుస్తకం పంపించమని దానికి ఎంత డబ్బైనా పంపగలనని చెప్పారు. నేను ఆయన అడ్రస్ అడిగి తెలుసుకొని ఆరోజే కొరియర్‌లో ఆ పుస్తకాన్ని పంపించాను. అది సరిగ్గా గురువారం సాయంత్రం 4 గంటలకు ఆయనకు అందింది. ఏదో దొరకని పదార్థం దొరికితే ఎంత ఆనందపడిపోతారో అంతటి ఆనందంతో ఆయన మళ్ళీ ఫోన్ చేసారు. నా ఫోనుకు గౌరవించి కొరియర్‌లో పుస్తకాన్ని డబ్బు అందుకోకుండానే పంపించారు. చాలా కృతజ్ఞుణ్ణి అంటూ మాట్లాడారు. మా ఇద్దరి సంభాషణలు ఇంగ్లీషులోనే జరిగాయి. డబ్బు ఎలా పంపించను అని అడిగారు. ఫరవాలేదు లెండి తరువాత పంపిద్దురుగాని అన్నాను. ఎందుకో ఆయన నంబరును నా మొబైల్ ఫోనులో సేవ్ చేసి వుంచాను. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి గురువారం నేను షిర్డి సాయినాథుని సూక్తులను ప్రతి గురువారం నా స్నేహితులు కొంతమందికి మెసేజ్‌గా పంపిస్తూ వుంటాను. దానిలోని సారాంశం ఒక్కొక్కరిని ఒక్కొక్క రకంగా ఆనందింపచేసేది. అలా పంపించేటప్పుడు ఈ లలిత్‌కుమార్‌సాహు గారికి కూడా మెసేజ్ పంపించాను. అలా మా స్నేహం మొదలైంది. ఆయనకు ప్రతి గురువారం బాబా మెసేజ్ పంపించేవాడిని. మొదట నెలకోసారి మాట్లాడుకునేవారం, తరువాత వారానికి ఒకసారి మాట్లాడుకునేవారం. కొన్నాళ్ళకు ప్రతిరోజు ఒక మెసేజ్‌కాని లేక ఫోన్‌లో మాట్లాడుకునేవారం. ఆయనకు కేంద్రపార మెయిన్ రోడ్డులో Times Watch Company అనే పెద్ద వాచ్‌షాపు వుంది. కూతురికి పెళ్ళి చేసారు ఆవిడ భువనేశ్వర్‌లో వుంది. పెళ్ళికి ఎదిగిన కొడుకున్నాడు. అతను USA లో వున్నాడు. ఇలా మెల్లిగా మా స్నేహం విడదీయరాని బంధం అయ్యింది. మా ఇంటిలో విషయాలన్ని ఆయనకు తెలుసు. ఆయన ఇంటిలో విషయాలన్నీ నాకు తెలుసు. ఇలా మా ఇద్దరి స్నేహం ఇంటివారందరికి కూడా తెలిసింది. ఆయన బిజినెస్ చిరాకులు, కుర్రాడి పెళ్లిప్రయత్నాలు కూడా చెపుతూ బాబాగారికి ప్రార్థన చెయ్యమనేవారు. ఆయన ద్వారా ఆ వూరిలో నలుగురు మిత్రులు ఫోనులో పరిచయం అయ్యారు. వారిలో ఇద్దరు చెన్నై వచ్చి నన్ను కలుసుకుని వెళ్ళారు కూడా. గత మూడు సంవత్సరాలుగా ఇన్ని విషయాలు జరుగుతున్నా ఆయన నేను ఇంతవరకు ఒకరినొకరు చూసుకొనలేదు. కనీసం ఇ-మెయిల్‌లో ఫోటోలు కూడా పంపుకోలేదు. ఈ విషయం మా మాటల మధ్యలో ఎన్నోసార్లు వచ్చినా ఇద్దరం ముఖత ఒకసారి కలుసుకుంటేనే ఆ థ్రిల్ ఉంటుందనుకునేవారం. ఇలా మా స్నేహం దిన దిన ప్రవర్థమానమవుతూ వుంది. ఆయన కూమారుడు అభిషేక్ పెళ్ళి కుదిరింది. జూన్ 29 భువనేశ్వర్‌లో. అప్పుడే అక్కడ జగన్నాథ రథ ఉత్సవం రోజులు. నాకు నెలరోజుల ముందుగా తెలియపరిచి నాకోసం మంచి హోటల్‌లో ఒక రూము కూడా రిజర్వ్ చేసారు. నేను తప్పకుండా మా ఆవిడతో ఫ్లైట్‌లో రావాలని వారి ఇంటికి కూడా రావాలని కోరారు. అంతా బాగానే వుంది. తెలుగు సినిమాలో స్నేహంపై వున్న అన్ని పాటలూ గుర్తుకువచ్చాయి. ప్రతిరోజూ ఫోన్ చేస్తూ మనిద్దరం కలుసుకోవాలి. రెండు వారాలే వున్నాయి, వారం ఉంది, నాలుగు రోజులు ఉన్నాయి అనుకుంటూ వున్నాం. కాని నేను తప్పనిసరిగా ఆ టైములో చెన్నైలోనే వుండవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం ఆయనకు మెల్లిగా చెప్పాను. చాలా నొచ్చుకున్నాడు. కాని నిజమైన స్నేహతుడు కాబట్టి పరిస్థితి అర్థం చేసుకుని సరే అంటూ నన్ను చూడలేకపోయాను అని బాధపడ్డాడు. పెళ్ళికి ముందురోజు నుంచి అక్కడ జరిగే తతంగం అంతా పూసగుచ్చినట్టు చెపుతూ ఆయన అల్లుడి చేత, కొడుకు చేత ఫోనులో మాట్లాడించారు. అంతేగాక ఆయన వియ్యంకుండికి ఫోను ఇచ్చి మాట్లాడమన్నారు. పెళ్లయిన నాలుగు రోజులకు కొడుకు, కొత్త కోడలితో షిరిడి వెళ్ళారు. అక్కడ సాయినాథుని సమక్షం నుంచి సంతోషంగా మాట్లాడారు. ఇలా మా ఇద్దరికి ఒకరోజు మాట్లాడుకోకపోతే ఏదో వెలితిగా వుండే స్నేహబంధంగా మారింది. అలా పెళ్ళయి నెల రోజులు గడిచింది. ఆగష్టు 19వ తారీఖు నుంచి ఎంత ప్రయత్నించినా నాలుగురోజులు నాకు లలిత్‌కుమార్ సాహూ ఫోన్ దొరకలేదు. ఎందుకిలా జరిగింది అనుకుంటూ వుండగా ఐదో రోజున నే విన్న వార్త ఒక క్షణంనన్ను మూగవాడిని చేసింది. నా మొబైల్‌లో ఆయన నంబర్ నుంచి ఫోను. ఎగిరి గంతేసినంత పనిగా ఆ ఫోన్ తీసి హాలో లలిత్‌బాయ్ అని మాట్లాడుతుంటే ఆప్రక్క 'సారీ అంకుల్ ఐయామ్ దుర్గాప్రసాద్, Son-in-Law of Lalit Kumar. He is no More అన్నాడు. నాకేమి అర్థం కాలేదు. ఒక్క నిమిషం అచేతనుడయ్యాను. విన్నది నిజమా కాదా తెలియలేదు. ఆ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంకుల్ 5 నిమిషాల క్రితం కూడా మీ గురించి మాట్లాడారు. ఇంకా ఆంటీకి (అంటే లలిత్‌కుమార్ భార్య) కూడా చెప్పలేదు. మీకే మొదటి ఫోన్ నేను జమ్ములో వున్నాను. ఇది యాక్సిడెంట్, కొంచెం హడావిడిగా వుంది. ప్లీజ్ తరువాత మాట్లాడతాను అన్నాడు. నేను మాటలు వింటున్నాను కాని నాకేమీ తోచటం లేదు. ఒక అరగంట తరువాత త్రిపాఠి అనే ఇంకొక ఒరిస్సా మిత్రుడు ఫోన్ చేస్తూ లలిత్‌బాయ్ మర్‌గయాజీ అంటూ ఫోన్‌చేశాడు. అతనికి విషయం సరిగ్గా తెలియలేదు. ఒక రెండు రోజులు నాకు మనసంతా అదోలా అయిపోయింది. రెండు రోజుల తరువాత లలిత్‌కుమార్ అల్లుడు ఎయిర్‌పోర్ట్ నుంచి ఫోన్‌చేశాడు. కూతురు, అల్లుడు, లలిత్‌కుమార్ ముగ్గురూ కలిసి జమ్ము వైష్ణోదేవి ఆలయానికి బయలుదేరారని, జమ్ముకొండ ఎక్కుతున్నప్పుడు ఒక రాయి విరిగి సరిగ్గా ఆయన నెత్తిమీద పడిందని వెంటనే ఆయన ప్రాణాలు విడిచారని చెప్పారు. ఫార్మాలిటీస్ అన్నీ ముగించుకొని ఈరోజు భువనేశ్వరన్ ఫ్లైట్‌లో ఆయన బాడీను తీసుకువెళుతున్నారని, ఇప్పటికే రెండు రోజులయి నందువల్ల ఆరోజు సాయంత్రమే కేంద్రాపారలో అంత్యక్రియలు ముగించేస్తామని చెప్పారు. నాకు ఏం మాట్లాడాలో, ఏమి విన్నానో కూడా అర్థం కాలేదు. మూడు సంవత్సరాలు ఒకరినొకరు చూసుకోకుండా ఫోన్‌లో మాత్రమే చాలా మంచి విషయాలు, మంచి చెడులు, మేం మాట్లాడితే ఆయన దానిని సత్‌సంగ్ (SATSANG) అనేవారు. అలా వుండేది సంభాషణ. పెళ్లి సందర్భంగా ఆయనను కలుసుకోకపోవడం ఎంత పొరపాటు. ఈ మూడేళ్ళలో ఆయన స్నేహితులు ఇద్దరు చెన్నై వచ్చి, ప్రెస్‌కు వచ్చి నాతో కాసేపు మాట్లాడి బాబా పుస్తకాలు, తీసుకుని ఆయనకు ఇచ్చినప్పుడు కూడా నేను నా ఫోటో ఇవ్వలేదు. ఆయన ఫోటోను పంపలేదు. మేం ఇద్దరం ఏదో ఒక మంచి సందర్భంలో కలుసుకుంటాము అనుకున్నాను కాని ఇలా జరుగుతుంది అనుకోలేదు. ఇది వెర్రి అనండి, విచిత్రం అనండి. అతిశయోక్తి అనండి. కాని ఇది జరిగిన నిజం. పదిరోజుల తరువాత ఆయన అల్లుడికి ఫోన్ చేసి ఆయన ఫోటో తెప్పించుకుని ఈ ప్రముఖాంధ్రలో ఇలా రాయవలసి వచ్చింది. ఇది అనుకోనిది. ఊహించనిది. మరి ఏ జన్మ రుణానుబంధమో ఈ స్నేహం తెలియలేదు. కాని ఒకరినొకరు చూసుకోకపోవడం అనేది నేను జీర్ణించుకోలేని బాధ. ఇంతగా ప్రచారసాధనాలు అభివృద్ధి చెందినప్పటికి ఇంకా పూర్వోత్తరపు మనుషులలాగా నడుచుకున్నామే. ఇప్పటి పిల్లలు తెలిసినా తెలియకపోయినా చాటింగ్‌లు, ఫేస్‌బుక్‌లు, ట్విట్టర్‌లు, బ్లాగులు, మెయిల్‌లు అంటూ వుంటే, మేమిద్దరం పూర్వోత్తరం మనుషులు ఒకరినొకరు తిన్నగా చూసుకుందామని, అప్పుడు ఆ అనుభూతి వేరని ఏవో వెర్రి ఆలోచనలు చేసాం. కాని మనం ఒకటి తలిస్తే దైవం వేరొకటి తలుస్తాడు. ఎందుకిలా జరిగింది. ఇంకా నాకిది జవాబు దొరకని ప్రశ్న.



(ఈ జీవిరావ్ పేజీలో ఇంకే విషయాలు రాయదలచుకోలేదు. నిజమైన స్నేహితుడి కోసం ఈ పేజీ ఆయన కోసం అంకితం. ఇది చదివాక మాలాగ వెర్రిగా ఎవరూ వుండద్దని సలహా.)